


# కాపు



కె. ఎ. ఎల్. సత్యవతీదేవి

"ఊఁ! అడుగు."

"నువ్వే అడుగు."

"అమ్మో ; నాకు భయం."

"నాకూ భయమే !"

"ప్లీజ్ ! అడగరా!"

"ఊహూ! నువ్వే అడుగు."

"నువ్వడిగితేనే ఒప్పుకుంటుంది."

"కాదు; నువ్వడిగితేనే పంపిస్తుంది."

మంత్లీ టెస్ట్‌పేపర్లు దిద్దుతున్న శారద తలెత్తి చూసింది. కళ్ళద్దాలు సవరించుకుంటూ.

భయంగా, బిత్తరగా చూశారు యెనిమిదేళ్ళ జ్యోతి, యేడేళ్ళ శ్యామ్ తల్లివంక.

"ఏమిటీ సంగతి?" చిన్నగా నవ్వుతూ అడిగింది శారద.

"మరేమో అమ్మా! శ్యామ్, రవీ వాళ్ళతో సినిమాకివెళదాం అంటున్నాడు." తమ్ముడిమీదపెట్టి అసలు సంగతి బయటపెట్టింది జ్యోతి.

"అక్కే! వెళదాం, అమ్మ నడుగు అంటోంది."

తప్పు తనది కాదన్నట్టు చెప్పాడు శ్యామ్.

నవ్వొచ్చింది శారదకి.

"ఏం సినిమా?" అడిగింది.

"హాస్పిటల్ గ్రౌండ్స్‌లో పిల్లల సినిమా చూపిస్తారట. రవీ వాళ్ళంతా వెళుతున్నారు. ప్లీజ్! మమ్మల్నీ పంపించమ్మా!" తల్లి చేతులు పట్టి వూపుతూ అంది జ్యోతి.

ప్లీజ్- అమ్మా!" చిన్న చేతుల్తో తల్లి చెంపల్ని రాస్తూ రిక్వెస్టు చేశాడు శ్యామ్.

"సరే సరే! ముందు డ్రస్ మార్చుకొని ముఖాలు కడుక్కోండి. నేను వచ్చి పాలు కలిపి ఇస్తాను" అంది శారద.

ఆ మాత్రం మాట కేసంతోషపడిపోతూ లోపలికి పరుగెట్టారు పిల్లలు.

• • •

గ్రౌండ్ అంతా పిల్లలతో నిండిపోయింది. కొద్దిమంది పెద్దవాళ్ళు కూడా వచ్చారు. అందరి దృష్టి సినిమా కోసం తయారుచేస్తున్న ఏర్పాట్లమీదే వుంది. తెర అమర్చారు. తక్కిన సరంజామా కూడా తయారయింది. సినిమా మొదలు పెట్టగానే, అంతవరకూ మాట్లాడుతున్న నోళ్లన్నీ మూతలుపడ్డాయి. సినిమా పది నిముషాలు సాగిందో, లేదో "పాము! పాము!" అరిచారెవరో. భయంతో జనమంతా పరుగులుతీశారు ఎటుపడితే అటూ. "శ్యామ్!" అంటూ అరుస్తూ నలుదిక్కులూ చూసింది జ్యోతి. అక్క కనబడక, ఏడుస్తూ, రోడ్డువైపు పరుగులు తీశాడు శ్యామ్. అంతే. దూసుకువచ్చిన లారీ రొదలో, శ్యామ్ ఆక్రందన కలిసిపోయింది. అంతా రక్తం! రోడ్డంతా రక్తం!!!

"శ్యామ్!" గట్టిగా అరిచింది శారద, వణికిపోతూ.

"వస్తున్నానమ్మా!" నీటుగా డ్రస్సయి లోపల్నించి వచ్చాడు శ్యామ్, వెనకే జ్యోతి. కళ్ళోసారి గట్టిగా మూసి తెరిచింది శారద. హాయిగా నిట్టూర్చి, కొంగుతో ముఖానికి పట్టిన చెమట అద్దుకుంది,

"అంతా భ్రమ! తన భయం! ఔను. ప్రతిక్షణం తనకి భయం! పిల్లలేమైపోతారోనన్న ఆదుర్దా. సరిగ్గా మూడేళ్ళక్రితం....తన చిన్నారి బాబు–రాజా!.... లారీకి బలికాలేదూ! విధి తనతో ఆడుకుంటోంది. భర్తకు దూరం చెయ్యడమే కాకుండా, తన కడుపులో చిచ్చు రగిల్చింది. వీళ్ళిద్దరినైనా తను కంటికి రెప్పలా కాచుకోవాలి...."

"ఏంటమ్మా! మాకు పాలు కలిపిస్తానని యిక్కడే కూర్చున్నావా! మాకు టైమయిపోతోంది." కాస్త విసుగ్గా అంది జ్యోతి.

"వూ త్వరగా!" తొందరపెట్టాడు శ్యామ్.

"బాబూ! ఈ రోజు సినిమాకి వద్దు" ఏం. చక్కగా, అక్కా నువ్వూ క్యారమ్సు ఆడుకోండి." అంది శ్యామ్‌ని దగ్గరికి తీసుకుంటూ.

తల్లి చేతుల్ని విదిలించాడు శ్యామ్.

"ఇందాకేమో పంపిస్తానని, ఇప్పుడేమో వద్దంటున్నావా! ఎప్పుడూ యింతే" కోపంగా అన్నాడు.

"రోజూ స్కూలికి ఆయాతో వెళ్ళడం, రావడం అంతే. ఎప్పుడూ యింట్లోనే వుండాలి. ఫో" కోపంగా అంది జ్యోతి మూతి ముడుచుకుంటూ.

"మీరు మంచి పిల్లలు. ఈ సారి నేను తీసుకెళతాను మంచి సినిమాకి. అమ్మ మాట వినరూ! అటు చూడండి. ఆ చిన్ని కోడిపిల్లలు వాళ్ళమ్మ పిలవగానే యెలా వెళుతున్నాయో." అంటూ వాకిట్లో జామి చెట్టు మొదట్లోవున్న కోడిని చూపించింది శారద.

తల్లికోడి "కుకు....కుకు" అని శబ్దం చేస్తూ పిలుస్తోంది. పిల్లలన్నీ, తల్లి కాళ్ళ క్రిందుగా దూరి, రెక్కల్లో వొదిగిపోతున్నాయి. వాటిని యింకా యింకా దగ్గరగా పొదుగు కొంటోంది తల్లి కోడి.

ఎంత జాగ్రత్త! అయినా ప్రొద్దున ఓ పిల్లని గద్ద తన్నుకుపోయింది. ఆ సంగతి తల్లి కోడికి గుర్తుందో, లేదోగానీ వున్నవాటిని మాత్రం అతి జాగ్రత్తగా గుండెల్లో దాచుకుంటోంది.

వాటినే చూస్తున్న పిల్లలిద్దర్నీ దగ్గరగా తీసుకుంది శారద. తల్లిమాట వినే మంచి పిల్లల్లా, ఆమె గుండెల్లో ఒదిగిపోయారు జ్యోతీ, శ్యామ్. ★

---

ప్రకాశంగారు ఆ ఆఫీసుకు పెద్ద వుద్యోగి. ఆయన చేతిక్రింద ఆఫీసర్లు, క్లర్కులు, ప్యూన్లు, ఆయన సంతకం లేనిదే పాస్ అవని బిల్లులు. బిల్లులు పాస్ అవకపోతే బెంబేలుపడిపోయే కంట్రాక్టర్లు వున్నారు.

ఆయన రచయితకూడా, ఎన్నో అభ్యుదయ రచనలు, ఉద్రేకపూరితమైన